

# ఆపద్బాంధవులు..

## నాడు కోవిడ్ కష్టకాలంలో.. నేడు వరదల్లో..

## వరద బాధితులకు అండగా నిలిచిన ఖమ్మం ఐఎంఏ

### ఎంబీబీఎస్ విద్యార్థినికి, జర్నలిస్టు కుటుంబాలకు చేయూత..

### జిల్లా ప్రముఖుల చేత ప్రశంసలందుకున్న ఐఎంఏ వైద్యులు



వనం నాగయ్య, కెరటం న్యూస్:

**సరిగ్గా నాలుగేండ్ల కిందట**

2020లో కరోనా మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని పొట్టనపెట్టుకున్న భయానక పరిస్థితులు కండ్ల ముందు కదలాడుతున్న వేళ.. దేశవ్యాప్తంగా నిరవధికంగా కొనసాగుతున్న కర్ఫ్యూను సైతం మించిన లాక్‌డౌన్ సమయం. ఈ పరిస్థితుల్లో ఒక్క హాస్పిటళ్లు మాత్రమే.. అదికూడా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వైద్యులు, సిబ్బంది సేవలు అందిస్తున్న సమయం అది.. కానీ యావత్ తెలంగాణలో మరెక్కడా లేని విధంగా ఖమ్మం జిల్లా ఐఎంఏ ఒక బృహత్తర మైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నాడు ఐఎంఏ అధ్యక్షులుగా ఉన్న డా.పి.శోభాదేవి, ప్రధాన కార్యదర్శిగా ఉన్న డా.కూరపాటి ప్రదీప్‌కుమార్ చొరవతో ఐఎంఏ టెలీమెడిసిన్‌కు శ్రీకారం చుట్టింది. తూతూ మంత్రంగా టెలీ మెడిసిన్ నిర్వహిస్తున్నామని చెప్పడం కాదు.. వేలాది మంది రోగుల ప్రాణాలు కాపాడేలా ఈ విలువైన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి జిల్లా మంత్రి, కలెక్టర్ మాత్రమే కాదు.. సాక్షాత్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో ప్రశంసలు, అభినందనలు అందుకున్న ఐఎంఏ సగర్వంగా తమ సేవలను ప్రజలకు పంచింది. నాడు సరిగ్గా 31 హాస్పిటళ్లలోని సీనియర్ వైద్యులు ఈ బృహత్తర టెలీమెడిసిన్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించి వేలాది మందికి నిరవధిక లాక్‌డౌన్‌లోనూ వేశేష సేవలతో ఆకట్టుకున్నారు.

ప్రస్తుతం సరిగ్గా ఇరవై రోజుల కిందట 2024 సెప్టెంబర్ 01వ తేదీ నుండి సుమారు పది రోజుల పాటు ఖమ్మం మున్నేరు కనీవినీ ఎరుగని రీతిలో 36అడగులకు మించి సునామీని తలపించేలా వరద పోటెత్తింది. ఈ పరిస్థితుల్లో వేలాది కుటుంబాలు ఖమ్మం నగరంలో వరదల్లో మునిగిపోయాయి. కేవలం కట్టుబట్టలు మాత్రమే మిగిలి ఒక్క రోజులోనే వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ పరిస్థితుల్లో మానవత్వం ఉన్న ఎందరో స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, ఖమ్మం నగర ప్రముఖులు, మంత్రులు, రాజకీయ నాయకులు ఇలా అన్ని వర్గాల వారు తమకు తోచిన విధంగా సాయం చేసి వరదబాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. ఈ పరిస్థిథుల్లో ఖమ్మం ఐఎంఏ కూడా విశేషమైన సహాయం చేసేందుకు ముందడుగు వేసింది. ఆకస్మికంగా వచ్చిన వరదలకు ఖమ్మంలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోగా ప్రయాణీకులు తినడానికి ఏమీ దొరకక ఇబ్బందులు పడుతున్న వేళ వెంటనే స్పందించిన ఐఎంఐ అధ్యక్ష, కార్యదర్శులు డా.కంభంపాటి నారాయణరావు, డా.జగదీష్‌బాబు, ఐఎంఏ కార్యనిర్వాహక సభ్యులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకుని తొలుత రైళ్లలో ఉన్న వందలాది మంది ప్రయాణీకులకు అల్పాహారం, పులిహోర, బిస్కెట్లు, వాటర్ బాటిళ్లు, దీర్ఘకాలిక మందులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. రెండో రోజూ ఇలాగే రైళు నిలిచిపోయి, ఖమ్మంలో చిక్కుకుపోయిన ప్రయాణీకులకు అల్పాహారం అందజేసి వారికి అండగా నిలిచారు. ఈ పరిస్థితుల్లో ప్రయాణీకులు ఖమ్మం వైద్యులకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.



### అన్నదానం, దుస్తులు, దుప్పట్టు పంపిణీ...

మొట్టమొదటిగా వరదలు వచ్చిన తొలిరోజే తమ సేవా కార్యక్రమాలకు నడుం బిగించిన ఖమ్మం ఐఎంఏకు జిల్లా ఉన్నతాధికారులనుండి రాజకీయ పార్టీలనుండి ప్రశంసలు వచ్చాయి. దీంతో తమ సేవలను మరింతగా ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే వరదబాధితులకు సుమారు 10రోజుల పాటు నిరంతరం కొనసాగించారు. ప్రధానంగా వరదబాధితులుగా మిగిలిపోయిన బొక్కలగడ్డ, కరుణగిరి, వెంకటేశ్వర నగర్, జలగం నగర్, స్వర్ణభారతి కల్యాణమండపం, కస్నాతండా, వాలియా తండా, పంపింగ్ వెల్ రోడ్డు చర్చి దగ్గర, ధంసలాపురం, ఇలా పలు ప్రాంతాల్లో ప్రతీ రోజూ ఒక ప్రాంతంలో నిత్యావసరాలు, భోజనాలు, దుస్తులు, దుప్పట్లు, మందులు ఇలా పలు రకాలుగా వరద బాధితులకు అండగా నిలిచారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానంగా ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శుల డా. నారాయణరావు, డా.జగదీష్ బాబు, డా.యలమంచిలి రవీంద్ర నాథ్, డ.కే. గురునాథరావు, డా.బొల్లి కొండ శ్రీనివాసరావు, డా.గోంగూర వెంకటేశ్వర్లు, డా.బాగం కిషన్‌రావు, డా.కావ్యచంద్ యాలమూడి, డా.గురునాథం, డా. మూడ్ నారాయణ, డా. జీవీ మురళి, డా. బాబూ రత్నాకర్, డా.చంద్రశేఖర్(మ్యాక్సికేర్), డా.పాటిబండ్ల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్టులకు, మెడికల్ విద్యార్థికి సాయం..

ఖమ్మంలో వరదలకు ఇబ్బందుల్లో ఉన్న పలువురు జర్నలిస్టు కుటుంబాలకు సైతం ఖమ్మం ఐఎంఏ తమ చేయూతను అందించింది. ప్రధానంగా జర్నలిస్టులకు నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేసింది. జూనియర్ వైద్యురాలిగా డాక్టర్ కోర్సు చదువుతున్న డా.తేజస్వినికి కుటుంబానికి చెందిన ఇల్లు వరదల్లో చిక్కుకుని వేలాది రూపాయల విలువైన పుస్తకాలు తడిసి పోవడంతో ఐఎంఏ మానవత్వం చాటుకుని ఆ విద్యార్థికి రూ.10వేలు ఆర్దిక సాయం అందించింది. ఐఎంఏలో సభ్యులుగా ఉన్న పలువురు హాస్పిటళ్ల వైద్యులు ఒక పక్క ఐఎంఏకు సహకారం అందిస్తూనే మరో పక్క వారు సొంతంగా వరదబాధితులకు అన్నదానం, నిత్యావసరాలు, మందులు పంపిణీ చేసి ప్రజలకు అండగా నిలిచారు. ఇలా జిల్లా ప్రజలు కష్టాల్లో ఉన్న ప్రతీ సారీ తమ వంతుగా సాయం చేస్తూ ఖమ్మం ఐఎంఏకు సర్వత్రా ప్రశంసలు అందుతున్నాయి.